## పది ఫలితాల్లో విద్యా రోహిణి విజయ దుందుభి

ప్రజాభూమి,బుట్టాయగూడెం



పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బుట్టాయిగూడెంకు చెందిన విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ విజయ దుందుభి మోగించిందని పాఠశాల ప్రిన్సిపాల్ కొండేపల్లి రామకృష్ణ తెలిపారు. విద్యా రోహిణి పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రధమ స్థానంతో పాటు మొదటి ఐదు స్థానాలను కైవసం చేసుకున్నట్లు వివరించారు. తమ పాఠశాల విద్యార్థులు కూచిపూడి అంజిబాబు 584, కనితి హర్షవర్ధన్ 583, రావూరి సోనీ శ్రీవాత్సవ్ 570, సోము పార్థు 569, ధూళి మోహన్ కృష్ణ 568 మార్కులను పొందినట్లు రామకృష్ణ చెప్పారు. ఈ విద్యా సంవత్సరం తమ పాఠశాల నుండి 27 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు హాజరై 100% ఫలితాలను సాధించారని చెప్పారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, పాఠశాల బోధన సిబ్బందిని, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు.

## రావికంపాడు జడ్పీ హైస్కూల్ 63% ఉత్తీర్ణత


ప్రజా భూమి, కామవరపుకోట



రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో 63% ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు చెప్పారు. 39 మంది బాలురు గాను 23 మంది ఉత్తీర్ణత సాధించారని, 39 మంది బాలికలకు 27 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థిని విద్యార్థులకు తరగతులు నిర్వహించి, వచ్చే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికీ ప్రణాళికలు తయారుచేసి అమలు చేస్తున్నట్లు అని చెప్పారు. ఆ ఏ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థిని విద్యార్థులకు ఆయా క్లాస్ టీచర్లు ద్వారా క్లాసులు నిర్వహింపజేయునట్లు చెప్పారు.

## పది ఫలితాల్లో మండలంలో 61.5% ఉత్తీర్ణత

ప్రజాభూమి,బుట్టాయిగూడెం.




పదవ తరగతి ఫలితాల్లో బుట్టాయిగూడెం మండలం 61.5% ఫలితాలను సాధించిందని మండల విద్యాశాఖ అధికారులు తెల్లం బాబురావు, నరేంద్ర రాయ్ తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం పదవ తరగతి ఫలితాలపై మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ మండలంలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల క్రింద 15 పాఠశాలల నుండి 613 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో 377 మంది(61.5%) ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రైవేట్ యాజమాన్యంలోని రెండు పాఠశాలల నుండి 55 మంది హాజరు కాగా 52 మంది (94.5%) ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో కోయ రాజమండ్రి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల 86% ఫలితాలతో ప్రథమ స్థానంలో ఉండగా అంతర్వేదిగూడెంకు చెందిన గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల 75%తో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో బుట్టాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కట్టా లావణ్య 579 మార్కులతో మండలంలోని ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, అదే పాఠశాలకు చెందిన పొలిమాట మెర్సీ ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు చెప్పారు. ప్రైవేటు యాజమాన్యంలోని పాఠశాలల్లో బుట్టాయిగూడెం విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ విద్యార్థి కె.అంజిబాబు 584 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు.

## రేఖపల్లి కేజీబీవీ ప్రభుత్వ పాఠశాల ప్రభంజనం

ప్రజభూమి, వి.ఆర్.పురం.



మండలంలోనీ పదోవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల కేజీవిబి విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో మొదటి,ద్వితీయ స్థానాలలో మండల పరిధిలోని పత్తిపాక గ్రామానికి చెందిన పిట్ట నాగలక్ష్మి 600 / 543 మార్కులు సాధించి మొదటి స్థానంలో, ఏటపాక మండలం నందిగామ గ్రామానికి చెందిన కొంగ పావని 600/522 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకమ్మ మాట్లాడుతూ ఈ సంవత్సరం మండలంలో 77% శాతం ఉత్తీర్ణం తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపకులు విద్యా బోధిస్తున్నారని తమ కళాశాల విద్యార్థులు నిరూపించారని, పేద విద్యార్థులు ఈ స్థాయిలో రాణించడానికి కృషి చేసినటువంటి ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పిల్లలు మా కేజీ పాఠశాలలో జాయిన్ అయితే ఉన్నత శిఖరాలను అవరోధించే విధంగా వారిని తీర్చిదిద్దామని పేర్కొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థుల హవా

ప్రజా భూమి జగ్గంపేట




జగ్గంపేట స్థానిక రావులమ్మ తల్లి గుడి వద్ద గుంటూరు వారిచే నడపబడుచున్న భాష్యం స్కూల్ నందు పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కె సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదోవ తరగతి ఫలితాల్లో స్థానిక భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని ముఖ్యంగా వాసిరెడ్డి హర్షిని 590 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, ఒబ్బిన్ని మోహన మేఘన చంద్రిక 585 మార్కులు అలాగే అబ్బిరెడ్డి నాగ లలిత 585 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు 580 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 7గురు, కానీ 550 మార్కులు సాధించిన విద్యార్థులు 31 మంది, 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 51 మంది ఉన్నారు. అలాగే 2025 పదో తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థులు అందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన భాష్యం విద్యార్థులందరికీ భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ అలాగే వైస్ చైర్మన్ హనుమంతరావు, ఎండి సాకేత్ రామ్ అలాగే జోనల్ ఇంచార్జ్ వి.గోవిందరాజు స్కూల్ ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ చాంప్స్ ప్రిన్సిపాల్ మేడం కె.వాణి ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోలవరం ప్రాజెక్ట్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజా భూమి ప్రతినిధి అన్నవరం

పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి పనులపై శంఖవరం మండలం, అన్నవరం గ్రామంలో నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వహించారు. ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా విజ్ఞాపన మేరకు అన్నవరం వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడిని నియోజకవర్గంలో ఉన్న ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన టిడిపి నాయకులు రైతులు మంత్రి ని కలిసి ప్రత్తిపాడు మండలంలో గల సుబ్బారెడ్డి సాగర్ కుడి, ఎడమ స్లూయిజ్ మరియు పాపయ్య డ్యాంల పాడై పోయిన గేట్ లకు మరమ్మత్తు పనులకు అవసరమయ్యే నిధులను విడుదల చేయవలసిందిగా కోరుతూ వినతిపత్రం అందించడం జరిగింది.



## అర్హులైన ప్రతీ గిరిజనుడికి స్వంత ఇల్లు మంజూరు చేస్తాం: మంత్రినాదెండ్ల మనోహర్

ప్రజాభూమి,బుట్టాయిగూడెం.

అర్హులైన ప్రతీ గిరిజనుడికి స్వంత ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మండలంలోని పులిరాముడుగూడెంలో పిఎం జన్మజాతి ఆదివాసీ న్యాయ మహా అధ్యయన్ (జన్మహా) కేంద్ర పథకం కింద ఇంటి నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంత్రి నాదెండ్ల బుధవారం పరిశీలించారు. గృహ నిర్మాణలబ్ధిదారు బి. మాధవిని కలిసి ఇంటి నిర్మాణ పనులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పిఎం (జన్మహా) పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిరుపేదలైన గిరిజనలకు 340 గజాలలో 3. 39 లక్షల రూపాయలతో ఇళ్లను నిర్మిస్తున్నదన్నారు. బుట్టాయి గూడెం మండలానికి 410 ఇల్లు మంజూరయ్యాయని, వాటిని జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అర్హుడైన ప్రతీ గిరిజనుడికి స్వంత ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల వద్దకు వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి సమస్య,



రోడ్లు, డ్రైనేజ్ స్, తదితర సమస్యలు ఉన్నాయని గ్రామస్తులు మంత్రికి తెలియజేయగా, త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిని మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, స్థానిక నాయకులు కుటికలపూడి గోవిందరావు, జి. సువర్ణరాజు, తదితరులుపాల్గొన్నారు.

## కృష్ణావరంలో పోలవరం ఎడమ కాలువ పీకేజీ 3 పనులు పరిశీలించిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజా భూమి జగ్గంపేట

కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ పికేజీ 3 పనులను బుధవారం సాయంత్రం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షుడుతో కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం పనులు జరుగుతున్న తీరును ఇంజనీర్లు ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఉదయం నుంచి ఏలేరు ఎడమ కాలవ పనులు పరిశీలిస్తున్నామని ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక టార్గెట్ పెట్టారని 2025 జూన్ నాటికి పోలవరం ఎడవకాల ద్వారా రైతులకు నీళ్లు అందించాలని సంకల్పంతో పనులు వేగవంతం చేయడం జరిగిందని అందులో భాగంగా ఈరోజు ఇక్కడ కి రావడం జరిగిందన్నారు. సీనియర్ నాయకులు సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తాళ్లూరు లిఫ్ట్ ద్వారా రైతులకు నీరు అందించేందుకు




సిమెంట్ పైపులను ఉపయోగించే వారిని ఆ పైపులు పూర్తిగా పాడవడంతో 31 వేల ఎకరాల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే నెహ్రూ అనేకసార్లు విన్నవించుకున్నారని వాటిని కూడా తొందర్లో పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) పుష్కర చైర్మన్ అడబాల భాస్కరరావు సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉటా నాని బాబు అడపా భరత్, బో దిరెడ్ల సుబ్బారావు,జగ్గంపేట డిసి నీలం శ్రీను, కాట్రావులపల్లి డిసి కంటే రామారావు, అడబాల వెంకటేశ్వరరావు,మంగ రౌతు రాము, జాస్తి వసంత్, అడబాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## 10 ఫలితాలలో లిటిల్ స్టార్ హై స్కూల్ ప్రభంజనం
### మండల ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు కైవసం

ప్రజాభూమి కుక్కునూరు

మండలంలో 10వ తరగతి ఫలితాల్లో కుక్కునూరు లిటిల్ స్టార్ హై స్కూల్ ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది లిటిల్ స్టార్ హై స్కూల్ నుండి మండల ప్రథమ స్థానం కే తరుణ్ 543 మార్కులతో మండల ద్వితీయ స్థానం పి అన్వేష్ రాజ్ 532 మార్కులతో మండల తృతీయ స్థానం టి లిఖిత 524 మార్కులతో మండల మూడు స్థానాలు సాధించి అగ్రగామిగా నిలిచారు లిటిల్ స్టార్ హై స్కూల్ నుండి 31 మంది విద్యార్థులు పరీక్ష రాయిగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత అయ్యారు అదేవిధంగా స్థానిక జడ్పీహెచ్ఎస్ స్కూల్ నుండి 52 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 33 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు జడ్పీహెచ్ఎస్ చేరవల్లి నుండి 46 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 26 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు జడ్పీహెచ్ఎస్ అమరవరం నుండి 35 మంది




విద్యార్థులు పరీక్ష రాయగా 29 మాత్రమే ఉత్తీర్ణులయ్యారు జి టి డబ్ల్యు ఏ జి హెచ్ ఎస్ స్కూల్ నుండి 38 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మాధవరం ఆశ్రమ పాఠశాల నుండి 18 మంది విద్యార్థులు హాజరుకాక 16 మంది ఉత్తీర్ణులయ్యారు కేజీబీవీ నుండి 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 39 మంది ఉత్తీర్ణులయ్యారు వేలేరు కేజీబీవీ నుండి 37 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 37 మంది ఉత్తీర్ణులయ్యారు ఈ విధంగా ఫలితాలు వచ్చినట్టు కుక్కునూరు ఎంఈఓ తెలిపారు అగ్రగామిగా నిలిచిన లిటిల్ స్టార్ హై స్కూల్ మండల మూడు స్థానాలు కైవసం చేసుకున్న విద్యార్థులను ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆది సత్యనారాయణ మరియు అధ్యాపక బృందం ఆయా విద్యార్థులకు ఇంటి దగ్గరికి వెళ్లి స్వీట్స్ పంచి అభినందనలు తెలియజేశారు

## బిందు సేద్యానికి ఆన్లైన్ చేయించుకోండి: పీవీఎస్ రవికుమార్

ప్రజా భూమి, జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మసేద్య పథకము, ఏలూరు జిల్లాలోని 2025-26 సంవత్సరములకు గాను నిర్దేశించిన భౌతిక లక్ష్యం 8500 హెక్టార్లు డ్రిప్/స్ప్రింకర్ పరికరములకు ప్రభుత్వ రాయితీ ని పొందుట కొరకు తమ గ్రామానికి సంబంధించిన రైతు సేవాకేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవల్సిందిగా జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వి.ఎస్. రవికుమార్ బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకము, ఏలూరు జిల్లా 2003-04 నుండి 2024-25 వరకు జిల్లాలో అమలు అయిన విస్తీర్ణం 115329 హెక్టార్లకు 93003 మంది రైతులు లబ్దిపొందియున్నారన్నారు. సూక్ష్మ సేద్య పథకము అమలునకు అందుబాటులో ఉన్న విస్తీర్ణం 84810 హెక్టార్లు అన్నారు. **బిందు సేద్యం సబ్సిడీ..**ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు (5 ఎకరాల వరకు) 100% సబ్సిడీ, ఇతర చిన్న,సన్నకారు రైతులకు (5 ఎకరములకు మించకుండా) 90% రాయితీ పొందవచ్చును. మధ్య తరహా రైతులకు (5 ఎకరములకు నుండి 10 ఎకరములకు మించకుండా) 70% రాయితీ పొందవచ్చును. పెద్ద రైతులకు 50% రాయితీ పొందవచ్చును.స్ప్రింక్లర్ ఇరిగేషన్ సబ్సిడీ..చిన్న, సన్నకారు, పెద్ద రైతులందరికీ 50% రాయితీ గా స్ప్రింక్లర్ లను పొందవచ్చును. బిందు మరియు తుంపర సేద్య పరికరములు ప్రభుత్వ రాయితీ పై పొందగోరు రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రము జత చేసి సంబంధిత మండల ఉద్యాన అధికారి/ గ్రామ ఉద్యాన సహాయకుడు/ గ్రామ వ్యవసాయ సహాయకుడు/ గ్రామ సెరికల్చర్ సహాయకుడు/ సూక్ష్మ నీటి పారుదల ప్రాంత అధికారులతో గాని లేక సంబంధిత గ్రామ రైతు సేవా కేంద్రము (ఆర్.ఎస్.కె) లేదా జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసు, ఏలూరు కార్యాలయము నందు బయోమెట్రిక్ ద్వారా నమోదు ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. అర్హులైన దరఖాస్తుదారుల తోట/ పొలమును, వారు ఎంపిక చేసుకొన్న సూక్ష్మ సేద్య కంపెనీ ప్రతినిదులు, రైతు సేవా కేంద్ర సహాయకుల క్షేత్ర సందర్శన చేసి, సూక్ష సేద్య డిజైన్ అంచనాల ( డి ఓ క్యు ) ను తయారు చేసిన పిమ్మట, రైతు చెల్లించవలసిన వాటాను వారి చరవాణి కి సందేశం వస్తుంది. ఆ మొత్తంను పిడి, ఎపియమ్ఐపి వారికి చెల్లించిన తరువాత దరఖాస్తును పరిశీ లించి కలెక్టర్ నుండి పరిపాలన అమోదము పొందిన పిమ్మట సదరు రైతులకు వారి తోట/ పొలములో సూక్ష్మ సేద్య పరికరాలను సరఫరా చేసి సంబంధిత కంపెనీ సాంకేతిక నిపుణులు ద్వారా బిగించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## అన్నవరం గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చాలని పీఓ కు వినతిపత్రం

ప్రజాభూమి, వి.ఆర్.పురం.

ప్రతీ సంవత్సరం వరదల సమయంలో అన్నవరంలో మా భూములు, ఇల్లు కేవలం 40 మీటర్ల నీటిమట్టం లోని మునిగిపోయేవి. ప్రతీ సారి వరదల సమయంలో పడుతున్న కష్టాలను చూసిన మా గ్రామానికి ఆర్ అండ్ ఆర్ జాబితాలో చోటు దక్కలేదని విషయం మాకు ఆశ్చర్యాన్నీ కలగజేస్తుందనీ, మా అన్నవరం గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చాలని బుధవారం చింతూరు ఐటిడిఎ పీఓ అపూర్వ భారత్ కు ఆయన కార్యాలయం వద్ద సమస్యలతో కూడిన వినతిపత్రంను అందించారు. ఈసందర్భంగా అన్నవరం గ్రామస్తులు మాట్లాడుతూ 16.08.2009 లో అన్నవరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో మా భూములు మునిగిపోతాయని మాకు తెలియజేసారు, 6.ప నెం.%ూా%/9/2009 లో భూములు మునిగిపోతాయని తెలియజేస్తూ మాకు నోటీసులు అందించారు, కొంతమంది భూములకు నష్టపరిహారం ఇవ్వడం జరిగింది, అవార్డు నెం.52 తేదీ 13.03.2013, భూములు మరియు



జీవనోపాధి కోల్పోతున్న వారికి రిలీఫ్ %ఠ% పునరావాస పరిహారము ఇప్పటివరకు అందజేయబడలేదనీ అన్నారు. కానీ ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్లో కేవలం వి.ఆర్.పురం దర్మ తాళ్లగూడెం, మొద్దులగూడెం, శ్రీరామగిరి 41.15 మీటర్ల కాంటూరు స్థాయి క్రింద మునిగిపోతాయని పేర్కొన్నారు. కావున మా గ్రామాల కష్టాలను తొలగించడానికీ, మాగ్రామాన్ని 41.15లో అధికారులు చేర్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో బురక కన్నారావు, బురక మారయ్య, సోడే దినేషా, సోడే వెంకమ్మ, కొవ్వా షి వెంకమ్మ, ఉయిక నూతన, కొవ్వాషి పెదరాముడు, కుంజ చిన్న రాముడు, బురక దుర్గారావు, మడకం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో చేరండి

ప్రజాభూమి,వి.ఆర్.పురం


18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించవద్దని, ఏపీవో శ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్ లకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మర్యులు ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం ఏపీవో శ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్ లందరికీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించవద్దని తెలిపారు. ఈ పథకమును పొందినట్లయితే వారికి ప్రమాదవశాత్తు యాక్సిడెంట్స్ జరిగినప్పుడు రెండు లక్షల రూపాయలు బీమా, పూర్తి అంగవైకల్యం కలిగినట్లయితే ఆ రెండు లక్షలు, పాక్షిక అంగవైకల్యం కి లక్ష రూపాయలు ఈ పథకం ద్వారా వస్తాయని ఈ సంవత్సరంకి 20 రూపాయలు ఇన్సూరెన్స్ చెల్లించవలెను అని అన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలు లోపు మధ్యలో ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది ఈ పథకానికి వచ్చి సంవత్సరానికి 436 రూపాయలు ఖాతాదారుని అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం రుసుము చెల్లించవలసి ఉంటుంది, దీనికి సాధారణ మరణానికి రెండు లక్షల రూపాయలు యాక్సిడెంట్లుగా జరిగినట్లయితే 5 లక్షల రూపాయలు ప్రతి లబ్ధిదారులకు ఈ పథకమును సద్వినియోగపరుచు కోవాల్సిందిగా ఏపీవో తెలిపారు.



ప్రజాభూమి
సత్యసాయి, అనంతపురం

# 588 మార్కులతో మెరిసిన ఆణిముత్యం చెల్లూరు నీలిమ
## రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఫస్ట్ డివిజన్లో పాస్

ప్రజాభూమి, అనంతపురము



పదో తరగతి వార్షిక పరీక్షల్లో బుధవారం వెలువడిన ఫలితాల్లో అనంతపురము నగరం పాత ఊరికి చెందిన చెల్లూరు నీలిమ 588 మార్కులతో ఆణిముత్యమై మెరిసింది. నగరంలోని రోటరీ స్కూల్లో చదువుతున్న ఈ బాలిక కృషితో ఫస్ట్ డివిజన్లో పాస్ కావడం విశేషం. మ్యాథమెటిక్స్ లో 97 మార్కులు, సోషల్ స్టడీస్ లో 99, మిగతా అన్ని సబ్జెక్టుల్లో 98 మార్కులను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. ఈ బాలిక తండ్రి సీ.సతీష్ కుమార్, తల్లి సి.శ్రీదేవి తమ బిడ్డ విజయం పట్ల గర్వంగా పొంగిపోయారు. బంధుమిత్రులు అభినందనలతో ముంచెత్తారు. వీరి కుటుంబ సన్నిహితులు బంధువు మల్లికార్జున ట్రేడర్స్ యజమాని సతీష్ అభినందనలు తెలిపి ఆశీర్వదించారు. కాగా, నీలిమ పాత్రికేయులతో మాట్లాడుతూ తాను ఎంబీఏ చేస్తానని తెలిపింది.

# పదో తరగతిలో మండల టాపర్ గా నిలిచిన రక్షిత.

ప్రజా భూమి, లేపాక్షి



లేపాక్షి మండల పరిధిలోని సిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రక్షిత పదో తరగతిలో 591 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిశంకర్ పేర్కొన్నారు. పేదింట జన్మించిన రక్షిత ఆరో తరగతి నుండి మంచి ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించేదన్నారు . గత ఐదు ఏళ్ళుగా తరగతిలో మొదటి స్థానంలో నిలిచిందని హెచ్ఎం తెలిపారు. పదో తరగతిలో రక్షితపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనపరిచారన్నారు. దానికి తగ్గట్టుగా రక్షిత చదువులో ముందుండి తన పని తాను చేసుకోపోతూ ఉండేది అన్నారు. క్రమశిక్షణాయుతమైన ఆ విద్యార్థిని చదువు మండల స్థాయిలో వికసించిందన్నారు. ఆ విద్యార్థినిని పలువురు అభినందించారు.

# లేపాక్షి మండలంలో పదవ తరగతిలో 76.36 % శాతం ఫలితాలు.

ప్రజా భూమి, లేపాక్షి

మండల పరిధిలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, ప్రైవేటు పాఠశాలల నుండి ఈ విద్యా సంవత్సరంలో 715 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా అందులో 546 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 76.36% ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్పలు తెలిపారు. ఎంజే పి గురుకుల పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 97.4% ఉత్తీర్ణతతో మండలంలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సుందర రాజు తెలిపారు. కస్తూరిబావిద్యాలయాలో 90% ఉత్తీర్ణత సాధించి ద్వితీయ స్థానంలోనూ,లయోలాపాఠశాలలో 87% ఉత్తీర్ణతతో తృతీయస్థానంలోనూ నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. అదేవిధంగా లేపాక్షి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 83 మంది విద్యార్థులకు 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం వి వి సి గిరి తెలిపారు. కొండూరు ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు 27 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయులు శేషగిరి బాబు పేర్కొన్నారు. చోళ సముద్రం ఉన్నత పాఠశాలలో 75 మందికి 48 మంది ఉత్తీర్ణులైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో 37 మందికి 35 మంది విద్యార్థులు పాస్ అయినట్లు ప్రిన్సిపల్ నీలిమ పేర్కొన్నారు. సిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 మందికి 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం రవిశంకర్ తెలిపారు. పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులకు 48 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం సుబ్బారావు పేర్కొన్నారు. విజెడ్పి ఉన్నత పాఠశాలలో 44 మందికి 30 మంది ఉత్తీర్ణులైనట్లు హెడ్మాస్టర్ ధనుశ్రీ పేర్కొన్నారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో 23 మందికి 16 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం ప్రకాష్ పేర్కొన్నారు. లేపాక్షి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదిమందికి ఏడు మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. లయోలా ఉన్నత పాఠశాలలో 118 మందికి 103 మంది, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 78 మందికి 76 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గత ఏడాది కంటే స్వల్పంగా ఉత్తీర్ణత శాతం పెరిగినట్టు ఎంఈఓ పేర్కొన్నారు.

# 10లో ముదిగుబ్బ టాపర్లుగా సాయికీర్తి, ఇందు, రమ్యశ్రీ

ప్రజాభూమి, ముదిగుబ్బ :







బుధవారం వెలువడిన పది పరీక్ష ఫలితాలలో ముదిగుబ్బ మండల టాపర్లుగా సాయికీర్తి, ఇందు, రమ్యశ్రీ నిలిచారు. బుక్కపట్నం మండలం మారాలకు చెందిన జయరాంరెడ్డి అనిత దంపతుల కుమార్తె ముదిగుబ్బ రామకృష్ణ విద్యాలయంలో చదివిన సాయికీర్తి 592, మండలంలోని గుడ్డంపల్లితండాకు చెందిన మెగావత్ గోపినాయక్ లక్ష్మీదేవిభాయ్ దంపతుల కుమార్తె సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన ఇందు 592, సానేవారిపల్లికి చెందిన గుత్తా దామోదరనాయుడు లావణ్య దంపతుల కుమార్తె పివీఎస్ పాఠశాలలో చదివిన రమ్యశ్రీ 589 మార్కులతో మంచి ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో టాపర్లుగా నిలిచారు. అదే విధంగా ముదిగుబ్బ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివినా ఇంకా హర్షవర్ధన్ 589, నరసింహ దేవా అనే విద్యార్థి 585 మార్కులు సాధించారు. వీరిని ఎంఈఓ రమణప్ప, ప్రభుత్వ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాఘవ అభినందించారు. అదేవిధంగా బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.శివాని 574, కొడవండ్లపల్లి ప్రభుత్వ హైస్కూల్లో సాయి డుటుజీని 533, దొరిగిళ్ళు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 100% ఉత్తీర్ణత సాధిస్తూ అంజలి అనే విద్యార్థి 528 మార్కులు సాధించింది. ముదిగుబ్బ కస్తూరిబాయి గాంధీ విద్యాలయం 87% ఉత్తీర్ణత సాధించగా జ్యోతి ప్రియా అనే విద్యార్థి 545 మార్కులు సాధించింది. అయితే ప్రైవేటు పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీపడి ఫలితాలు సాధించారు.

# నారాయణ పాఠశాల ముందు పి.డి.ఎస్.యు. ధర్నా

ప్రజాభూమి, హిందూపురం టౌన్




ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలి పి. డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నారాయణ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ, నారాయణ పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఈ సంవత్సరం ఏకంగా రూ.10 వేల ఫీజులు పెంచి తల్లిదండ్రులపై పెనుభారం మోపుతున్నార న్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యను వ్యాపారం చేస్తు చేస్తున్న నారాయణ పాఠశాల పైన విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నందీష్, నాయకులు నాగేంద్ర, మహేష్, బాలాజీ, మోహిత్, మనోజ్,జనార్ధన్, సురేష్, నాగేంద్ర, రాజా, షాహిద్ పాల్గొన్నారు.

# శ్రీ బాలాజీ విద్యా మందిర్ పాఠశాలలో ఎస్ ఎస్ సి టాపర్గా నిలిచిన తేజస్విని

ప్రజాభూమి బ్యూరో, అనంతపురం



అనంతపురం నగరం రుద్రంపేట వద్దనున్న శ్రీ బాలాజీ విద్యా మందిర్ పాఠశాలలో పదవ తరగతిలో తేజస్విని 549/600 మార్కులు సాధించి స్కూల్లో మొదటి స్థానంలో నిలిచారు. బేల్దారు పని చేస్తూ తేజస్వినేని చదివించి ఒక డాక్టర్ గా చేయాలనేది తల్లిదండ్రుల కోరిక. పాఠశాల అరెస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి కనేగంటి మాట్లాడుతూ మాపాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం చాలా సంతోషం వ్యక్తం చేశారు.

# ఉగ్రదాడులతో దేశ సమైక్యతను దెబ్బతీయలేరు: పహల్గామ్ ఘటన ఎంతో బాధించిందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

## మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే

ప్రజాభూమి, అనంతపురము



తమ దాడులతో భారతదేశంలో సమైక్యతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల క్రూరమైన ఆలోచనలు భారత్ లో చెల్లవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని దారుణంగా చంపడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదని, ఉగ్రవాదులు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించు కుంటారని పేర్కొన్నారు. ఈ ఘటనలో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధ కల్గించిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కశ్మీర్‌లో ఇటీవల రికార్డు స్థాయిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా శాంతి విద్రోహ శక్తులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని, ఇలాంటి వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లు ఉపేక్షించబోరని అన్నారు. ఉగ్రవాద శక్తులను కూకటి వేళ్లతో పెకిలించేందుకు భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మా ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పహల్గామ్ ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# ఇతర రాష్ట్రాలు నుంచి వచ్చే రైళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టండి : జిల్లా ఎస్పీ పి.జగదీష్

## రైళ్లలో డాగ్ స్క్వాడ్ ద్వారా విస్తృతంగా తనిఖీలు
## జాగిలంతో గుంతకల్లు రైల్వే స్టేషన్లో రైళ్లలో విస్తృత తనిఖీలు

ప్రజాభూమి, అనంతపురము





ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో డాగ్ స్క్వాడ్ ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు ఒన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్ గుంతకల్లు రైల్వేస్టేషన్లో ఈరోజు తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో తర్ఫీదు పొందిన జాగిలం షైనీ ద్వారా గుంతకల్లు జంక్షన్ గుండా వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఒడిస్సాలోని భువనేశ్వర్ నుండీ బెంగుళూరుకు గుంతకల్లు మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్ ప్రెస్, గుంతకల్లు జంక్షన్ గుండా అమరావతి, వాస్కోడిగామ రైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌ కర్యం కల్గకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరుగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమా నాస్పదులు, వారి లగేజీలను షైనీ జాగిలం ద్వారా లోతుగా తనిఖీ చేశారు.

# నేటి నుండి నూతన సిలబస్ పై అవగాహన సదస్సు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఇంటర్మీడియట్ విద్యలో నూతన సిలబస్ పై గురువారం నుండి అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డి. ఐ.ఈ.ఓ రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఆదేశాల మేరకు మారిన సిలబస్ తో పాటు మారుతున్న ప్రశ్నల సరళి పైన కళాశాల అధ్యాపకులకు అవగాహన కల్పించడం కోసం ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఏప్రిల్ 24 నుండి మే 6వ తేదీ వరకు పెనుకొండ జూనియర్ కళాశాలలో ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులందరూ తప్పనిసరిగా అవగాహన సదస్సులకు హాజరుకావాలని, ఎవరికి ఎలాంటి మినహాయింపులు లేవని ఆయన తెలిపారు.

# ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేయాలి

## - భారత ప్రభుత్వానికి సీపీఐ డిమాండ్ చేస్తున్నది : జిల్లా కార్యదర్శి జాఫర్

ప్రజాభూమి, అనంతపురము




జమ్మూ కాశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నదని, ఇటువంటి చర్యలను తమ పార్టీ ఉపేక్షించదని,భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. పహల్గాంలోని బైసరన్ లో ఉగ్రదాడి చేసి 28 మంది పర్యాటకులను ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ ఘాతకానికి పాల్పడినట్లు ప్రకటించుకుందని పేర్కొన్నారు. "ఈ సంవత్సరం జూలై 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అమర్నాథ్ యాత్రకు లక్షల మంది యాత్రికులు రెండు మార్గాలలో హిమలింగం దర్శనానికి వెళు తుంటారు. అనంతనాగ్ జిల్లాలో పహల్గాం నుంచి, గాంధర్బల్ జిల్లా బాల్తాలా నుంచి చేరుకునే అవకాశం ఉంది. అమర్నాథ్ యాత్రను అడ్డుకునే కుట్రలో భాగంగా సాయుధ ముష్కరులు చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. పురుషులే లక్ష్యంగా 28 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారు. టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థకు మతం లేదు.. అన్ని మతాల పైన దాడులు చేశారు. కావున భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేస్తున్నది" అని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా మరణించిన 28 కుటుంబాలకు సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటన జరగకుండా భారత ప్రభుత్వం ఇంటిలిజెన్సీ వ్యవస్థను పటిష్టవంతం చేయాలని సిపిఐ సూచిస్తున్నదని జాఫర్ పేర్కొన్నారు.

# మే 4 న నందమూరి బాలకృష్ణ కు పౌర సన్మానం -ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, టిడిపి నేతలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రముఖ సినీ కథానాయకులు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు మే 4వ తేదీన పౌర సన్మానం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లను చైర్మన్ తో పాటు టిడిపి నేతలు, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ నెల 28వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హిందూపురం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పద్మభూషణడికి ఘనంగా పౌర సన్మాన కార్యక్రమాన్ని మే 4న ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా క్రీడామైదానంలో సభాస్థలి ఏర్పాట్లు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ వంటివి ఎలా చేయాలని అందుకు సంబంధించిన ప్రదేశాన్ని కూడా పరిశీలించారు. సినీ రంగానికి తెలుగు ప్రేక్షకులకు తన అద్భుతమైన నటన చాతుర్యంతో ఎన్నో విజయవంతమైన సినిమాలు అందించి ప్రేక్షకులకు వినోదాన్ని పంచిపెట్టారని కొనియాడారు. సందేశాత్మమైన చిత్రాలు ద్వారా గొప్ప సందేశం అందించారని, తన నటనను మెచ్చి కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డు ఇవ్వడం హిందూపురం ప్రజలకు గర్వకారణంగా భావిస్తూ హిందూపురం పుర ప్రజలచే పౌర సన్మాన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అన్ని వర్గాల ప్రజలు కులమత వర్గ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద కుమార్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, కౌన్సిలర్ సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ రాముల నజీర్, భార్గవ్, అమీన్, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం - ఇరువురి అరెస్ట్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఇరువురిని అరెస్టు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి హిందూపురం స్టేషన్ పరిధిలో మేళాపురం క్రాస్ వద్ద ముద్దిరెడ్డిపల్లికి చెందిన విశ్వనాథ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 192 కర్ణాటక హైవార్డ్స్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే హిందూపురం మండలం వేపమానుగేటు వద్ద అప్పలకుంటకు చెందిన పి.హరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 96 హైవార్డ్స్ చీర్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు సిఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్,ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, రమణ,సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నట్టు సీఐ వివరించారు.

# హజ్ యాత్ర ఎంతో పవిత్రం-యాత్రికులకు వ్యాక్సి నేషన్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హజ్ యాత్ర అనేది ఇస్లాం యొక్క ముఖ్యమైన విధులలో ఒకటని మక్కా నగరంలోని కాబాను సందర్శించడం ఓ పుణ్యకార్యమని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి బ్యాలెన్స్ లో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లింలందరికి దేవునికి మరింత దగ్గరయ్యే అవకాశం కలుగుతుందన్నారు. హజ్ కు వెళ్లే యాత్రికుల ఆరోగ్యం సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం మాట్లాడుతూ, పవిత్ర హజ్ యాత్ర ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమని, ఈ హజ్ యాత్రలో విశ్వమానవాళి క్షేమం కొరకు ప్రార్థించండని కోరారు. ముఖ్యంగా విదేశీ ప్రయాణాల్లో వాతావరణ మార్పులుంటాయని, ఆ ఉష్ణోగ్రతలు నియంత్రించే విధంగా మన దినచర్యలు, ఆహారపు అలవాట్లు వుండాలని, మన ఆరోగ్య సమస్యలకు నిత్యం మనం వాడే మందులు వెంట వుండాలని సూచించారు. అదే విధంగా రోగ నిరోధకశక్తి పెంచే పళ్ళు, ఆహారంతోబాటు నిద్ర, విశ్రాంతి, వ్యాయామం కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్ల యాత్రికుల ఆరోగ్యానికి భంగం కలుగకుండా ఉండేందుకు, అంత ర్జాతీయ నిబంధనలమేరకు యాత్రికులకు వ్యాక్సినేషన్ అత్యంత అవశ్యకమని తెలియజేశారు. స్థానిక పిపి యూనిట్ వైద్యాధికారి ఆనంద్ బాబు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా హజ్ ను సందర్శించే యాత్రికులు 134 మందికి వ్యాక్సిన్షన్ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వైద్యులు జక్కా నరేంద్ర, నవీన్, ఆయాషా, తస్నీమ్, ఆశా డీసీఎం త్రిలోక్ నాథ్, హజ్ కమిటీ సభ్యులు డైమండ్ బాబా, కౌన్సిలర్లుఇర్షాద్ అహ్మద్, గిరి, టిడిపి నాయకులు అజ్మతుల్లా, అంజాద్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల ఎస్ఎస్ సి లో టాపర్గా నిలిచిన రీమాతాజ్

ప్రజా భూమి బ్యూరో, అనంతపురం



అనంతపురం నగరంలో రంగస్వామి నగర్ ఆదర్శ పాఠశాల యందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం పదవ తరగతి పరీక్షా ఫలితాలు వెలువడిన విషయం పాఠకులకు విదితమే. ఆదర్శ పాఠశాల యందు రిమాతాజ్ ఎస్ ఎస్ సి ఆదర్శ పాఠశాలలో 575/600 మార్కులు సాధించి స్కూల్లో మొదటి స్థానం లో నిలిచారు. ఆదర్శ పాఠశాల పరస్పాండెంట్ కుటాగుళ్ల రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ 100% ఉత్తీర్ణత సాధించడం పాఠశాల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

